జనం కోసం.. అక్షర సమరం
# ఇదీ సంగతి
స్పెషల్ ఎడిషన్
Epaper.Edisangathi.com
సంపుటి: 4 - సంచిక: 173 | 17 ఫిబ్రవరి 2026 | మంగళవారం | 4 పేజీలు



## పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

- ఇంటర్ పరీక్షల దృష్ట్యా పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు
- జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశం

(నిజామాబాద్, ఇదీ సంగతి)

జిల్లాలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 163 బీఎన్ఎస్-ఎస్ (గతంలో 144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని 58 పరీక్ష కేంద్రాల వద్ద ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. ప్రధానంగా ఈ క్రింది నిబంధనలను పాటించాలని సూచించారు: పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడటం నిషిద్ధం. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ సెంటర్లు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు తప్పనిసరిగా మూసి ఉంచాలి. కేంద్రాల వద్దకు ఎలాంటి నిషేధిత వస్తువులను తీసుకురాకూడదు.ఈ ఉత్తర్వులు పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు అమలులో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.




## కేసీఆర్ జన్మదిన వేడుకలతో..
# గులాబీ శ్రేణుల సందడి

- బాజిరెడ్డి గోవర్ధన్ పుట్టినరోజు వేడుకల నిర్వహణ
- నూతన కార్పొరేటర్‌కు ఘన సన్మానం

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

భారత రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అలాగే నేడు బాజిరెడ్డి గోవర్ధన్ పుట్టినరోజు కూడా కావడంతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయలక్ష్మి దంపతులకు సన్మానం..

ఇదే వేదికపై నూతనంగా ఎన్నికైన 37వ డివిజన్ కార్పొరేటర్ ప్యాట విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు ప్యాట సంతోష్‌లను బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నాయకులు సత్యప్రకాశ్, సుజిత్ సింగ్, దండు శేఖర్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేయర్ దంపతులకు శివదీక్షా సేవా సమితి ఘన సన్మానం

(నిజామాబాద్, ఇదీ సంగతి)

నిజామాబాద్ నగర నూతన మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన కూరగాయల ఉమారాణి దంపతులను రమేష్‌ను శివదీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా సత్కరించారు. నగర అభివృద్ధిలో ఆధ్యాత్మిక సేవలో ఈ దంపతులు చూపుతున్న చొరవను కొనియాడుతూ, సమితి సభ్యులు వారిని శాలువాలతో కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, ఉమారాణి నాయకత్వంలో నిజామాబాద్ నగరం మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలోశివదీక్షా సేవా సమితి ప్రతినిధులు సదా శివ, గంజి రమేష్, సోమలింగం కిరణ్, మనోహర్, శ్రీకాంత్, కిషన్, తమలపాకులు గంగాధర్, శివ రతన్, రాకేష్, జశ్వంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జనం కోసం.. అక్షర సమరం
# ఇదీ సంగతి
సంపుటి: 4 - సంచిక: 173 | 17 ఫిబ్రవరి 2026 | మంగళవారం | 4 పేజీలు




# మేయర్ పీఠంపై.. బీసీ మార్క్..!

● వరుసగా నాలుగోసారి బీసీ వర్గాలకే మేయర్ పదవి..!

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

నిజామాబాద్ మున్సిపల్ రాజకీయాల్లో మేయర్ పీఠం మరోసారి వెనకబడిన వర్గాలనే (బీసీ) వరించింది. కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సామాజిక సమీకరణాల్లో బీసీలదే పైచేయిగా నిలుస్తోంది. తాజా ఎన్నికల్లో రాజకీయ వ్యూహాలు, అనూహ్య మలుపుల మధ్య ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కూరగాయల ఉమారాణి నిజామాబాద్ నాలుగో మేయర్‌గా పగ్గాలు చేపట్టనున్నారు. ఎంఐఎం మద్దతుతో కాంగ్రెస్ ఈ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో నగర రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. 2005లో నిజామాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు మేయర్ పదవి బీసీలకే దక్కుతూ రావడం గమనార్హం. గత చరిత్రను పరిశీలిస్తే మొదటి మేయర్ గా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ధర్మపురి సంజయ్. రెండో మేయర్: బిఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుంచి ఆకుల సుజాత. మూడో మేయర్ బిఆర్ఎస్ నుంచి నీతు కిరణ్.లు కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు. వరుసగా నాలుగో మేయర్ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి కూరగాయల ఉమారాణి కూడా బీసీ సామాజిక వర్గాల చెందిన మహిళ కావడం విశేషం. ఈసారి మేయర్ పీఠం 'జనరల్ మహిళ'కు కేటాయించడంతో నగరంలో రాజకీయ సెగలు రాజుకున్నాయి. తొలుత కాంగ్రెస్ పార్టీ తరఫున బలమైన అభ్యర్థిగా ప్రముఖ వ్యాపారవేత్త నరేందర్ రెడ్డి సతీమణి సమంత కట్పల్లి పేరు వినిపించింది. ఆమె గెలుపు కోసం ఏకంగా రూ. 8 కోట్ల పన్ను బకాయిలు చెల్లించి 'నో డ్యూస్' సర్టిఫికేట్ పొందడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, అనూహ్యంగా ఆమె ఎన్నికల్లో ఓటమి పాలవ్వడంతో రాజకీయ సమీకరణాలు తలకిందులయ్యాయి. సమంత వైదొలగడంతో పోటీ బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళల మధ్యకు మారింది. ఈ క్రమంలో 49వ డివిజన్ నుంచి విజయం సాధించిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కూరగాయల ఉమారాణిని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. నిన్నటి వరకు సామాన్య గృహిణిగా జీవనోపాధి పొందుతూ ప్రజా సేవలో ఉన్న ఆమె, నేడు ఏకంగా నగర ప్రథమ పౌరురాలిగా ఎంపిక కావడం విశేషం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సొంత జిల్లాలో పట్టు పట్టి బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారు. బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించినప్పటికీ, మేజిక్ ఫిగర్ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం సహకారంతో పీఠాన్ని దక్కించుకుంది. ఒప్పందంలో భాగంగా ఎంఐఎం కార్పొరేటర్ సల్మా తహసీన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.ఒక సామాన్య గృహిణి అయిన ఉమారాణికి మేయర్ పదవి దక్కడం పట్ల నగర ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇది సామాన్యుల విజయమని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

---

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)



నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మెయిన్ గేట్ పక్కన ఒక గుర్తు తెలియని వ్యక్తి కింద పడి ఉండగా పక్కన ఉన్న వారు అతన్ని గమనించి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది జీజీహెచ్ నిజామాబాద్‌కు చికిత్స గురించి తరలించారు. వెంటనే అక్కడే ఉన్న డాక్టర్లు వచ్చి పరిశీలించి చూడగా మృతి చెందినట్టు నిర్ధారించారు. అతని వయసు సుమారు 50 సంవత్సరాలు వరకు ఉంటుంది. అతని పైన బట్టలు బూడిద రంగు ఫుల్ షర్ట్, బ్లూ కలర్ స్వెటర్ మరియు బ్లూ కలర్ ప్యాంట్ కలదు . వ్యక్తి వాలకం బట్టి భిక్షాటన చేసుకునే వ్యక్తిగా కనపడుతున్నది, ఇతని యొక్క జేబులు చెక్ చేయగా ఏమి ఆధారాలు లేవు. గుర్తుతెలియని వ్యక్తి గురించి ఏమైనా సమాచారం ఎవరికైనా తెలిసినచో 8712659714 వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని అన్నారు.

## నిజామాబాద్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

- వృద్ధ దంపతులను కాపాడిన పోలీసులు

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)



నగరంలోని పెద్దబజార్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ ప్రమాదం తప్పింది. ఒక ఇంట్లో సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సకాలంలో స్పందించిన పోలీసులు ప్రాణనష్టం జరగకుండా అడ్డుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. ఘటన వివరాల్లోకి వెళ్తే.. పెద్దబజార్ ప్రాంతంలోని దాసరి రమేష్ అనే వృద్ధుడు తన భార్యతో కలిసి నివాసముంటున్నారు. వారు అదే ఇంట్లో చిన్న కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ ఘాతం (షార్ట్ సర్క్యూట్) సంభవించి మంటలు అలుముకున్నాయి. లోపల దంపతులు గాఢ నిద్రలో ఉండటంతో ప్రమాదాన్ని గమనించలేకపోయారు. ఆ సమయంలో గస్తీ నిర్వహిస్తున్న రెండవ టౌన్ పెట్రోలింగ్ పోలీసులు మంటలను గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇంటి తలుపులు తట్టి, నిద్రలో ఉన్న వృద్ధ దంపతులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక యంత్రం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుంది. సిబ్బంది శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కిరాణా దుకాణంలోని కొంత సామాగ్రి దహనమైందని, సుమారు వేలల్లో ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రాణాలకు తెగించి వృద్ధ దంపతులను కాపాడిన రెండో టౌన్ పోలీసులపై స్థానికులు, కాలనీ వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. "పోలీసులు సకాలంలో స్పందించకపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని" స్థానికులు పేర్కొన్నారు.

ఇదీ సంగతి
జనం కోసం..
అక్షర సమరం

# రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తేవాలి






(నిజామాబాద్ ఇదీసంగతి)

రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు తమ ప్రతిభను చాటి నిజామాబాద్ ప్రతిష్టను పెంపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని దోమలగూడలో మంగళవారం నుండి క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా, నిజామాబాద్ జిల్లా నుండి 35 మంది బాలబాలికలతో కూడిన బృందం ఈ పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం బయలుదేరి వెళ్ళింది. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద నుండి చిన్నారులు బయలుదేరి వెళ్తున్న ప్రత్యేక బస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి, చిన్నారులకు ఆల్ ది బెస్ట్ అని



విషెస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి జిలా్లకు మంచి పేరు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చిన్నారులను జాగ్రత్తగా తీసుకెళ్లాలని, క్రీడలు ముగిసిన అనతరం తిరిగి జాగ్రత్తగా తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీ.ఈ.ఓ అశోక్, భవిత కేంద్రాల కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



(నిజామాబాద్ ఇదీసంగతి)

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక విరామం అనంతరం తిరిగి సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జెడ్పీ డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్నలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 34 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు.

కాగా, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఆయా కార్యాలయాల పనితీరును, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళను సందర్శించి, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ జరపాలన్నారు. బాలికల విద్యాలయాలు, హాస్టళ్ళలో విద్యార్థినుల భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించేలా తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. ఎక్కడ కూడా భోజనం కలుషితం కాకుండా చూడాలని, విద్యార్థులు ఆరోగ్యాల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# కులమతాల రాజకీయం చెల్లదు

**- అభివృద్ధికే పట్టం : పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**



(నిజామాబాద్ ఇదీసంగతి)

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కులమతాల కంటే అభివృద్ధి వైపే మొగ్గు చూపారని, అందుకే నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహా జిల్లాలో మెజార్టీ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ ఓటర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుమారు రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగిరిందని మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో జిల్లాలో అఖండ విజయం సాధించామని పేర్కొన్నారు. “ఒక సాధారణ కార్యకర్త మేయర్ కావడం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని, పండ్లు అమ్ముకునే స్థాయి నుంచి నేడు మేయర్ పీఠాన్ని అధిష్టించిన ఉమారాణి గెలుపే దీనికి నిదర్శనం” అని ఆయన కొనియాడారు.

విభజన రాజకీయాలకు స్వస్తి

కులమతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసిన వారికి పట్టణ ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ అభ్యర్థుల గెలుపుకు సోపానాలని అన్నారు. ఇంజనీరింగ్, వ్యవసాయ కళాశాలల ఏర్పాటుతో పాటు రూ. 680 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాయని తెలిపారు.

అభివృద్ధి కోసమే ఎంఐఎం సహకారం

నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే ఎంఐఎంతో కలయిక అవసరమని భావించినట్లు పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎంపై పోటీ చేసి ఐదు సీట్లు గెలుచుకున్నామని, నగర ప్రగతి కోసం కలిసి ముందుకు సాగుతామని చెప్పారు. కాగా, బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఏకైక అభ్యర్థి కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించడం గమనార్హమన్నారు. కొన్ని చోట్ల ప్రతిపక్షాలు సెంటిమెంట్‌ను అస్త్రంగా చేసుకుని ప్రజలను ఉసిగొల్పడం వల్ల సుమారు 7 స్థానాల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యామని విశ్లేషించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ అయితే నగరం అన్ని రంగాల్లో అగ్రగామిగా మారుతుందని ప్రజలు ఆశీర్వదించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# అభయ హస్తం కాలనీలో ఘనంగా మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు.

(నిజామాబాద్ ఇదీసంగతి)

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కమిషన్ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ  జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని అభయ హస్తం కాలనీలో ఘనంగా నిర్వహించారు, అభయహస్తంకాలోని లో గల నర్మదా బాణ శివాలయంలో మహ్మద్ షబ్బీర్ అలీ  ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు, నిజామాబాద్ నగర అభివృద్ధి కోసం, ప్రతి డివిజన్ కి కోటి రూపాయలు  ప్రత్యేక నిధులను కేటాయించి  కృషి చేస్తున్నారని అన్నారు, అదేవిధంగా త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ ట్యాంకులు, రోడ్లు డ్రైనేజీ ల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు లాంటి కనీస సౌకర్యాల కల్పన కోసం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అభయహస్తం కాలనీ నాయకులు కల్పన, రాములు, మీనా, లలిత, సాయన్న, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.